సాక్షి
వికారాబాద్

ఆదివారం ׀ 29 ׀ సెప్టెంబర్ ׀ 2024



జీఓ 25ను సవరించండి

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు డిమాండ్ చేశారు. 8లో▸



పరిశుభ్రతతో ఆరోగ్యం

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నాపరిమళ్ అన్నారు. 8లో▸



ప్రారంభమెన్నడో..?

దుద్యాల్ మండల కేంద్రంలో బస్తీ దవాఖానా భవన నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. 9లో▸

న్యూస్‌రీల్

అభివృద్ధి పనుల పరిశీలన



అనంతగిరి అడవిని పరిశీలిస్తున్న సువర్ణ

అనంతగిరి: జిల్లాలో జరుగుతున్న అటవీ అభివృద్ధి పనులను శనివారం ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు డాక్టర్ సి.సువర్ణ పరిశీలించారు. పరిగి రేంజ్ పరిధిలోని జాఫర్‌పల్లి అర్బన్ ఫారెస్టు బ్లాక్‌ను సందర్శించారు. అక్కడ చేపట్టాల్సిన పనులపై పలు సూచనలు ఇచ్చారు. అనంతరం అనంతగిరి అడవిని, కోట్‌పల్లి రిజర్వాయర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్, ఎఫ్ఆర్‌ఓ శ్యాంకుమార్, ప్రతిమ, రాజేందర్, సెక్షన్ ఆఫీసర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

కోట్‌పల్లి సందర్శన

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు, రుద్రారం ఫారెస్టు సెక్షన్ పరిధిలోని నాగసమందర్ రిజర్వుడు ఫారెస్టును, చింతకుంట గ్రామ సమీపంలోని ప్లాంటేషన్‌ను పీసీసీఎఫ్ సువర్ణ శనివారం జిల్లా ఫారెస్టు అధికారి జ్ఞానేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కోట్‌పల్లి ప్రాజెక్టు అభివృద్ధిపై ఆరా తీశారు. అర్బన్ పార్క్ కోసం ఆపరేషన్ స్కీంకు సబంధించిన డబ్బులు విడుదల కాలేదని డీఎఫ్‌ఓ ఆమెకు వివరించారు. ప్రాజెక్టులో కాయకింగ్ బోటింగ్‌ను పరిశీలించిన సువర్ణ కోఆర్డినేటర్ రాములుతో మాట్లాడారు. ఇక్కడ చిల్డ్రన్ పార్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. యువతకు ట్రెక్కింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. పర్యాటకులు ఒకేచోట భోజనం చేయడానికి తగిన సౌకర్యం కల్పించాలని సూచించారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



అనంతగిరి: అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, మాతాశిశు సంక్షేమ శాఖ అధికారిని కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మానసిక దృఢత్వాన్ని పెంపొందించాలి



పరిగి: మార్కులు, ర్యాంకుల కోసం పిల్లలను మానసికంగా నిర్బంధించరాదని, చదవుపై కోరిక కలిగేలా ప్రేరణ చేయాలని తెలంగాణ సైకాలజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, సైకాలజిస్ట్ ఎం.ఎ.కరీం అన్నారు. శనివారం పట్టణంలో మైండ్ పవర్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదివే సమయంలో ఎదురయ్యే మానసిక సమస్యలను గుర్తించాలని విద్యార్థులకు సూచించారు. అందులో విద్యాపరమైన లోపాలను సరిచేసుకొని చదవాలన్నారు. అప్పుడే పాఠ్యాంశాలపై పట్టు సాధిస్తారని తెలిపారు. పిల్లల మైండ్ యాక్టివ్‌గా ఉండేందుకు షార్ప్ గేమ్స్‌తోపాటు శారీరక శ్రమ కలిగించే ఆటలు నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్లకు పిల్లలు బానిసలుగా మారే ప్రమాదాన్ని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. విద్యార్థుల్లో మానసిక, ఆరోగ్య సమస్యలు ఉంటే హెల్ప్‌లైన్ నంబర్ 9440488571కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీలకు రూ.7.48 కోట్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. ఈ మేరకు రూ.7.48 కోట్లు మంజూరయ్యాయి. మూడు వేల జనాభా ఉన్న పంచాయతీలకు నిర్వహణ ఖర్చుల కింద నెలకు రూ.50 వేలు, ఎనిమిది వేల మంది జనాభా ఉన్న పంచాయతీలకు రూ.75 వేలు, అంతకంటే ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీలకు రూ.లక్ష చొప్పున విడుదల చేసింది. దీనిలో భాగంగా జిల్లాలోని 3,116 మంది పంచాయతీ సిబ్బందికి రూ.3.13 కోట్లు విడుదల చేసింది. పది పంచాయతీల్లో ట్రాక్టర్ లోను కిస్తీల చెల్లింపునకు రూ.3.11 లక్షలు, 446 పంచాయతీల్లో విద్యుత్ బిల్లుల చెల్లింపునకు రూ.40.43 లక్షలు మంజూరు చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ తెలిపారు. ఆయా నిధులను పంచాయతీ కార్యదర్శుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు.

6,71,940 మంది ఓటర్లు



దోమ మండలం పోలేపల్లిలోని గ్రామ పంచాయతీ కార్యాలయం

ఓటరు తుది జాబితాను విడుదల చేసిన అధికారులు

- మహిళా ఓటర్లే అధికం
- 'స్థానిక' ఎన్నికలకు కసరత్తు
- జిల్లాలో 585 గ్రామ పంచాయతీలు
- ప్రస్తుతం జీపీల్లో కొనసాగుతున్న ప్రత్యేక పాలన

వికారాబాద్: మళ్లీ ఎన్నికల సందడి ప్రారంభం కానుంది. ఇప్పటికే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగియగా మరో ఎన్నికల పండుగకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గ్రామ పంచాయతీల పదవీ కాలం జనవరి 31తో ముగియగా ఫిబ్రవరి నుంచి ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. ఇప్పటికే జీపీ ఎన్నికలు పూర్తి కావాల్సి ఉన్నా అనివార్య కారణాలతో ప్రభుత్వం వాయిదా వేసింది. రెండు నెలల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి పంచాయతీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఓటరు జాబితా సిద్ధం చేయాలని, బీసీ కమిషన్ సైతం నివేదికతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆ దిశగా కసరత్తు ప్రారంభించిన అధికారులు మండలాలు, జీపీలు, వార్డుల వారీగా ఓటరు జాబితాను సిద్ధం చేశారు. శనివారం అధికారులు ఓటరు తుది జాబితాను విడుదల చేశారు. దీంతో అందరి దృష్టి గ్రామ పంచాయతీ ఎన్నికలపై పడింది. ఇప్పటికే మండల, జిల్లా పరిషత్‌ల పదవీకాలం ముగియగా త్వరలో మున్సిపాలిటీల పదవీకాలం కూడా ముగియనుంది. ఇక వరుస ఎన్నికలు రావడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. పంచాయతీ పోరుపై త్వరలో స్పష్టత రానుంది.

బిజీబిజీగా అధికారులు

జిల్లాలో 585 గ్రామ పంచాయతీలు ఉండగా.. అధికారులు మండలాల వారీగా వివరాలు సేకరిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎంపిక చేసిన పోలింగ్ స్టేషన్లకు అదనంగా ఎన్ని అవసరం అవుతాయి అనే విషయాన్ని గ్రామాల వారీగా వివరాలు సేకరిస్తున్నారు. గత ఎన్నికల సమయంలో ఒక్కో గ్రామంలో రెండు నుంచి నాలుగు బూతులు ఏర్పాటు చేయగా పంచాయతీ ఎన్నికలకు సంబంధించి వార్డుల వారీగా బూతులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఇంకా ఎన్ని పోలింగ్ స్టేషన్లు, ఎంత మంది సిబ్బంది అవసరం, చేయాల్సిన ఏర్పాట్లు తదితర అంశాలకు సంబంధించిన సమాచారం సేకరిస్తున్నారు. ఓటర్లను సైతం వార్డుల వారీగా విభజించి ఎన్ని బూతులు అవసరమనే విషయంపై కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం విడుదల చేసిన ఓటరు తుది జాబితా ప్రకారం జిల్లాలో పురుషులతో పోలిస్తే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 6,71,940 ఉండగా ఇందులో 3,32,038 మంది పురుషులు, 3,39,885 మంది మహిళలు, 17 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు.

పోటీకి సిద్ధమవుతున్న ఆశావహులు

వంద శాతం ఎస్టీ జనాభా ఉన్న పంచాయతీలను గతంలో ఆ సామాజిక వర్గానికే రిజర్వు చేశారు. దీంతో బీసీలకు అన్యాయం జరిగిందనే వాదన తెరపైకి వచ్చింది. దీంతో ప్రభుత్వం బీసీ కమిషన్‌ను నివేదిక కోరింది. జిల్లాలో 4,982 వార్డులు ఉండగా ప్రతి వార్డులో పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. పోటీ చేసేందుకు ఆశావహులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తమ గ్రూపులు, వర్గాలను కూడగట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
బంట్వారం	8,437	8,841	00	17,278
బషీరాబాద్	18,983	20,828	00	39,811
బొంరాస్‌పేట	21,980	22,385	06	44,371
ధారూరు	17,529	18,073	00	35,602
దోమ	21,651	21,506	00	43,157
దౌల్తాబాద్	21,288	22,102	03	43,393
కొడంగల్	15,794	16,203	00	31,997
కోట్‌పల్లి	10,237	10,625	00	20,862
కుల్కచర్ల	24,702	24,506	04	49,212
మర్పల్లి	22,540	22,001	01	44,542
మోమిన్‌పేట	19,200	19,430	00	38,630
నవాబుపేట	18,663	18,344	00	37,007
పరిగి	18,434	18,539	01	36,974
పెద్దేముల్	19,376	20,407	00	39,783
పూడూరు	21,311	21,553	00	42,564
తాండూరు	22,229	23,318	01	45,548
వికారాబాద్	11,740	12,006	00	23,746
యాలాల	17,944	19,518	01	37,463



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్ చిత్రంలో ఎస్పీ నారాయణరెడ్డి

ప్రమాద స్పాట్లను గుర్తించండి

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశం

అనంతగిరి: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారులపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రమాద స్థలాలను గుర్తించి అక్కడ స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, పంచాయతీ కార్యదర్శి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారుల ఇంజనీర్లతో కమిటీ వేయాలని సూచించారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో ప్రమాద స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నివేదిక సమర్పించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబాలకు తక్షణ పరిహారం అందేలా చూడాలన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించడం, అత్యవసర వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను తొలగించాలన్నారు. అనంతరం ఎస్పీ కె.నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ముందస్తు చర్యలతో ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ ఉమేష్, ఆర్అండ్‌బీ ఇన్‌చార్జ్ ఈఈ శ్రీధర్‌రెడ్డి, తాండూరు, వికారాబాద్, కొడంగల్, పరిగి డీఎస్పీలు, ఎక్సైజ్, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ భూములు కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ హెచ్చరించారు. కనకమామిడి రెవెన్యూ పరిధిలో కొందరు రియల్ వ్యాపారులు రూ.30 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి చుట్టూ ప్రీకాస్ట్ వాల్ ఏర్పాటు చేసి అందులో గదులు నిర్మిస్తున్నారన్న సమాచారంతో శనివారం అక్కడికి చేరుకున్నారు. డ్రోజర్లతో అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఆ స్థలంలో ప్రభుత్వ భూమిగా గుర్తించి సర్వే నంబర్ పేరుతో బోర్డును ఏర్పాటు చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. 261 సర్వే నంబర్ పట్టా భూమి పేరు చెప్పి ప్రభుత్వ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి అక్రమ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. ఐదెకరాల్లో లేఅవుట్ చేసి ప్లాట్లుగా అమ్మడానికి ప్రయత్నిస్తున్నారని నిర్ధారించుకుని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కబ్జాకు యత్నించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఆక్రమణలకు ప్రయత్నిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుజిత్, భాస్కర్‌యాదవ్, భరత్‌యాదవ్, మహేశ్ యాదవ్, అమర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

త్వరలో సోలార్ వెలుగులు

- కొండారెడ్డిపల్లిలో ఇంటింట సర్వే చేసిన ట్రాన్స్‌కో బృందం
- పైలెట్ ప్రాజెక్టుగా గ్రామం ఎంపిక
- అధికారులతో మాట్లాడిన తిరుపతిరెడ్డి

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామస్తులకు ఇక మీదట సోలార్ విద్యుత్ అందనుంది. శనివారం 39మంది ట్రాన్స్‌కో ఉద్యోగులు గ్రామంలో పర్యటించారు. 153 ఇళ్లకు వెళ్లి క్షేత్ర పరిశీలన చేశారు. అర్హులను గుర్తించారు. ట్రాన్స్‌కో సీఈ ఆనంద్, వికారాబాద్ జిల్లా ఎస్ఈ సంజీవరెడ్డి, తాండూరు డీఈఈ భానుప్రసాద్, కొడంగల్ ఏడీఈ నవీన్‌కుమార్, తాండూరు ఏడీఈ ఆదినారాయణ పర్యవేక్షణలో ఇంటింటి సర్వే చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి కొండారెడ్డిపల్లికి వెళ్లి అధికారులతో మాట్లాడారు. సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సమగ్ర సర్వే చేసిన తర్వాత నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామంలో ప్రతి ఇంటికీ సోలార్ సిస్టం బిగించడానికి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. కొండారెడ్డిపల్లిని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందన్నారు. సాధారణంగా ఒక కిలో వాట్ సోలార్ సిస్టం ఏర్పాటుకు రూ.70 వేలు ఖర్చు అవుతుందని, అందులో ప్రభుత్వం రూ.30 వేలు సబ్సిడీ ఇస్తుందని, ఇంటి యజమాని రూ.40వేల చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అయితే ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందా లేకపోతే నామమాత్రపు ధరకు వసూలు చేస్తుందా అనే వివరాలను ఉన్నతాధికారులు వెల్లడిస్తారని చెప్పారు. గ్రామంలో ఉన్న 153 ఇళ్లకు గాను ఒక్కో ఇంటికి 3 కిలోవాట్ల చొప్పున మొత్తం 459 కిలోవాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

తీపి కబురు

త్వరలో కొడంగల్ నియోజకవర్గ విద్యార్థులకు న్యూట్రీషన్ బ్రేక్ ఫాస్ట్



కొడంగల్‌లో నిర్మిస్తున్న కేంద్రీకృత వంటశాల

- 312 పాఠశాలలకు చెందిన 28వేల మందికి అల్పాహారం
- సీఎం సమక్షంలో ఒప్పందం చేసుకున్న రెండు సంస్థలు
- రూ.6.4 కోట్ల విరాళం ప్రకటించిన 'వయాట్రీస్'
- శరవేగంగా వంటశాల నిర్మాణం
- పైలెట్ ప్రాజెక్టుగా కొడంగల్ ఎంపిక

కొడంగల్: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తీపి కబురు అందింది. త్వరలో రుచికరమైన హెల్తీ న్యూట్రీషన్ బ్రేక్ ఫాస్ట్ అందనుంది. 312 పాఠశాలలకు చెందిన 28వేల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందజేస్తారు. ఇందుకోసం హరే రామ హరే కృష్ణ చారిటబుల్ ఫౌండేషన్, వయాట్రీస్ సంస్థలు శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఒప్పందం చేసుకున్నాయి. హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ సీఈఓ కౌంతేయా దాస, వయాట్రీస్ కంపెనీ సీఎస్ఆర్ ఫండ్స్ ఇండియా అడ్మినిస్ట్రేటీవ్ హెడ్ మిషెల్ డొమినికా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా మొదటి విడతలో రూ.6.4 కోట్ల విరాళాన్ని వయాట్రీస్ కంపెనీ అందించింది. కొడంగల్‌లో అన్ని వసతులతో కూడిన వంటశాలను నిర్మిస్తున్నారు. ఇందుకు సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై భారం పడకుండా రెండు సంస్థల మధ్య ఒప్పందం కుదిర్చారు. దేశంలో ఎంతో పేరు ప్రతిష్ఠలు ఉన్న స్వచ్ఛంద సంస్థ హరే రామ హరే కృష్ణతోపాటు ప్రపంచ వ్యాప్తంగా ఫార్మా రంగంలో పేరుగాంచిన వయాట్రీస్ సంస్థలను ఏకం చేశారు. ఈ రెండు సంస్థల సహకారంతో ప్రతి రోజూ ఉదయం పూట ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు న్యూట్రీషన్ ఫుడ్ అందించనున్నారు. కొడంగల్‌లో కేంద్రీకృత వంటశాల నిర్మాణ

రెండు సంస్థల మధ్య ఒప్పందం

పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తి కాగానే సీఎం రేవంత్‌రెడ్డి ప్రాజెక్టును ప్రారంభిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు ఈ ప్రాజెక్టుపై అధ్యయనం చేస్తున్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య.. పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు సీఎం ప్రకటించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కొడంగల్‌కు వరాల జల్లు కురిపిస్తున్నారు. తన పదవీ కాలంలో కొడంగల్‌ను రాష్ట్రంలో అగ్రగామిగా నిలపడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని స్థానికులు కొనియాడుతున్నారు.

ఇప్పటికే పనులు దాదాపు పూర్తికావచ్చాయి. తెలంగాణలో పైలెట్ ప్రాజెక్టుగా కొడంగల్‌ను ఎంపిక చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నారు. సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యతో పాటు పౌష్టికాహారం అందించడానికి కృషి చేస్తున్నారు.

రాజీమార్గమే రాజమార్గం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి
- జాతీయ లోక్ అదాలత్‌లో 2,740 కేసుల పరిష్కారం

అనంతగిరి: లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం కోసం ముందుకు వచ్చే ఇరువర్గాలు విజయం సాధించినట్లేనని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్‌లోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,740 కేసులు రాజీ అయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీమార్గంతో కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. రాజీ మార్గమే రాజమార్గమన్నారు. ఇరువర్గాలు విశాల దృక్పథంతో ఆలోచిస్తే కేసుల నుంచి విముక్తి కలుగుతుందన్నారు. ప్రతి వ్యక్తికీ చట్టాలపై అవగాహన ఉండాలని అన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు, గ్రామాల్లో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిషోర్, సీనియర్ సివిల్ జడ్జి డీబీ శీతల్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శృతిదూత, స్పెషల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అశోక్, ఎస్పీ నారాయణరెడ్డి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సయ్యద్ ఖయూమ్, పీపీలు, ఏపీపీలు, సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

'కాంగ్రెస్ దళిత వ్యతిరేక పార్టీ'

షాద్‌నగర్‌రూరల్: దేశంలోని దళితులకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకంగా పని చేస్తోందని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ అన్నారు. దళితులపై కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఎస్సీమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంకనోళ్ల వెంకటేశ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దళితులపై రాహుల్‌గాంధీ ఇష్టాను సారంగా మాట్లాడుతున్నారని, దేశ సంస్కృతి, సంప్రదాయాలు ఆయనకు తెలియవని అన్నారు. దేశ ఖ్యాతిని దిగజార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారని మండిపడ్డారు.

క్లుప్తంగా

నేడు పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

ధారూరు: ధారూరు ప్రాథమిక వ్యవసాయ పర పతి సంఘ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం ఉదయం 11:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ సత్యనారాయణరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో అక్టోబర్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు జమా ఖర్చులపై చర్చించి ఆమోదంపై చర్చ జరుగుతుందని చెప్పారు. సంఘం డైరెక్టర్లు, సభ్యులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

రేపు ఎఫ్ఎస్సీఎస్ సర్వసభ్య సమావేశం

సీఈఓ మురళీగౌడ్

పెద్దేముల్: పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం(ఎఫ్ఎస్సీఎస్) సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు సంఘం సీఈఓ మురళీగౌడ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు నిర్వహించే ఈ సమావేశం చైర్మన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన కొనసాగుతుందన్నారు. సంఘం సభ్యులు, రైతులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అదనపు నిధుల మంజూరుకు కృషి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి



వేంకటేశ్వరస్వామి వారి ఆలయాన్ని పరిశీలిస్తున్న తిరుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి

దౌల్తాబాద్: మండల కేంద్రంలో వేంకటేశ్వరస్వామి వారి ఆలయ పునఃనిర్మానం కోసం నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరుతానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయాన్ని సందర్శించారు. గత ప్రభుత్వం రూ.50లక్షల నిధులు మంజూరు చేసిందని అదనపు నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఇందుకు స్పందించిన తిరుపతిరెడ్డి అదనపు నిధుల మంజూరుకు అవసరమైన ప్రతిపాదనలు తయారుచేసి నివేదికను ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపాలని కడా అధికారి వెంకట్‌రెడ్డికి సూచించారు. ఆయన వెంట నాయకులు వెంకట్రావు, వీరన్న, విజయ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, దస్తప్ప, వెంకట్రాములు తదితరులున్నారు.

గనుల్లో అక్రమ తవ్వకాలు

విద్యుత్ సరఫరా నిలిపివేసి బ్లేడ్‌లు స్వాధీనం

- ఎక్మాయి గనులను సీజ్ చేసిన మైన్స్ ఏడీఏ సత్యనారాయణ
- ఆందోళనకు దిగిన కార్మికులు

బషీరాబాద్: మండల పరిధిలోని ఎక్మాయి గుట్టలోని నాపరాతి గనుల్లో శనివారం మైన్స్ అధికారులు, పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. లీజులు లేకుండా కొందరు అక్రమంగా గనులు తవ్వుతున్నారని గ్రామస్తులు తాండూరు ఏడీఏ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుకు స్పందించిన మైన్స్ ఏడీఏ సత్యనారాయణ, ఎస్ఐ గఫార్ సిబ్బందితో కలిసి గనుల్లో పర్యటించారు. లీజులు లేకుండా తవ్వకాలు చేపడుతున్నారని ఆరోపణ మేరకు కాశప్ప గనులను సీజ్ చేశారు. మిర్యాణం నర్సింలు, మంజునాథ్ అనుమతులు లేకుండా గనులను బయటి వ్యక్తులకు విక్రయిస్తున్నట్లు పలువురు కార్మికులు ఏడీఏకు వివరించారు. దీంతో ఆ గనులకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. బండలను కోసే యంత్రాల బ్లేడ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో అధికారులకు గనులు తవ్వుతున్న కార్మికులకు, వ్యాపారులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కక్షపూరితంగా తమ గనులను సీజ్ చేస్తున్నారని కాశప్ప అనే వ్యాపారి ఆరోపించాడు. ఇక్కడ పేద కార్మికులు గనులు తీసుకొని జీవనం సాగిస్తున్నారని చెప్పారు. అయితే లీజులు లేకుండా ఎవ్వరు తవ్వకాలు జరిపిన ఉపేక్షించేదిలేదని ఏడీఏ సత్యనారాయణ హెచ్చరించారు.



అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు

సొసైటీ మూతతో.. యథేచ్ఛగా మైనింగ్

మూడు దశాబ్దాల కిందట గ్రామానికి చెందిన సుమారు 120 మంది పేద గని కార్మికులు కలిసి శ్రీ వేంకటేశ్వర క్వారీ సొసైటీని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నుంచి సొసైటీకి అప్పట్లో సుమారు. 4.20 ఎకరాల గని భూములను లీజులకు ఇచ్చింది. అందులో తవ్వకాలు జరుపుతూ ప్రభుత్వానికి రాయల్టీ, లీజులు చెల్లించేవారు. కాగా పదేళ్లుగా సొసైటీ ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో ఇష్టానుసారంగా అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. 2015లో సబ్ కలెక్టర్‌గా పనిచేసిన సందీప్‌కుమార్ ఝా గనుల్లో పర్యటించి అక్రమ తవ్వకాలున్నాయని కోత మిషన్‌లను సీజ్ చేశారు. రాజకీయ నాయకులు కార్మికులను దృష్టిలో పెట్టుకొని అనుమతులు తీసుకొని ప్రారంభించుకోవాలని సూచించారు. ఇక అప్పటి నుంచి ఏ ఒక్కరు కూడా లీజులు తీసుకోకుండానే తవ్వకాలు జరుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

జీఓ 25ను సవరించండి



దోమ: బొంపల్లి పాఠశాలలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నేతలు

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు

పరిగి: ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం తహసీల్దార్ ఆనంద్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం రాములు మాట్లాడుతూ.. అశాస్త్రీయమైన సర్దుబాటు జీఓ 25ను సవరించాలన్నారు. సర్దుబాటుకు ముందే బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని.. అప్పీల్స్‌ను సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు మొయిజ్‌ఖాన్, వెంకటయ్య, గంగాధర్, బుచ్చయ్య, యూసూఫ్ పాల్గొన్నారు.

జీఓ నంబర్ 25ను రద్దు చేయండి: ఎస్టీయూ

దోమ: జీఓ నంబర్ 25ను వెంటనే రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి షఫీ డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని బొంపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో మధ్యాహ్నభోజన విరామ సమయం అనంతరం జాక్టో ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి జీఓ నంబర్ 25ను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ద్వారా ప్రతీ పాఠశాలకు ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ఉంటాడని అన్నారు. 60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులతో బోధన ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ప్రతి పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని, 40 మంది కంటే ఎక్కువ పిల్లలు ఉన్న ప్రాథమిక పాఠశాలలో పీఎస్‌హెచ్‌ఎం, నలుగురు ఉపాధ్యాయులు ఉన్నప్పుడే ప్రాథమిక విద్య అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ముత్యప్ప, ఉపాధ్యాయులు నరేందర్, ప్రవీణ్, అనంతయ్య, వెంకటయ్య, స్వప్న, మాధురి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నాలుగు సార్లు రుణమాఫీ చేస్తామని ప్రకటించినా లక్ష్య రూపాయలు కూడా చేయలేదన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇచ్చిన ప్రతీహామీని నెరవేరుస్తామన్నారు. కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పీఏసీఎస్ డైరక్టర్లు కొండయ్య, నర్సింలు, రత్నమ్మ, ఒమ్లా, కాంగ్రెస్ బ్లాక్-బి అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆనందం, నాయకులు కృష్ణారెడ్డి, మోత్కూరు వెంకటేశ్, రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

గంజాయి విక్రేతకు రిమాండ్

176 గ్రాములు స్వాధీనం

అనంతగిరి: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ సీఐ రాగవీణ తెలిపిన ప్రకారం.. వికారాబాద్ పట్టణంలోని రైల్వే ఆస్పత్రి సమీపంలో ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందింది. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ టీంతో కలిసి దాడులు నిర్వహించి పట్టుకున్నారు. ఈ దాడిలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎండీ.వజీద్ వద్ద 176 గ్రాముల గంజాయి లభ్యమైంది. గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు ప్రేంకుమార్‌రెడ్డి, శ్రీనివాస్, విష్ణువర్ధన్‌రెడ్డి, హన్మంతు, శివప్రసాద్ తదితరులు ఉన్నారు.



పోలీసుల అదుపులో నిందితుడు

భార్యపై కత్తితో దాడి

భర్తకు రిమాండ్

కొడంగల్ రూరల్: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శాంతప్ప, విజయలక్ష్మి దంపతులు తరుచూ గొడవపడేవారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి విజయలక్ష్మిపై శాంతప్ప కత్తితో దాడి చేశారు. దీంతో బాధితురాలు విజయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు శాంతప్పను రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ సత్యనారాయణ చెప్పారు. బాధితురాలు తాండూరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం



శ్రీకాంత్(ఫైల్)

బంట్వారం: ఇంట్లోంచి వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన కోట్‌పల్లి మండలం అన్నాసాగర్‌లో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ప్రవంతి తెలిపిన ప్రకారం.. అన్నాసాగర్‌కు చెందిన శ్రీకాంత్(27) ఈ నెల 25న ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం తండ్రి నర్సింలు పోలీసులను ఆశ్రయించాడు. కేసు దర్యాప్తులో ఉంది.

'సంక్షేమ యాత్ర'ను జయప్రదం చేయండి

ఒగ్గు కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బీరప్ప



బొంరాస్‌పేట: ఒగ్గు కళాకారుల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న 'గడపగడపకు సంక్షేమ యాత్ర'ను జయప్రదం చేయాలని ఒగ్గు కళాకారుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బీరప్ప అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జిల్లా ఒగ్గుకళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పూజారి శాంతప్ప ఆధ్వర్యంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా సంక్షేమ యాత్ర న్విహించనున్నట్లు బీరప్ప తెలిపారు. గత ప్రభుత్వం జానపద కళాకారులకు అందించని సంక్షేమ పథకాలు ప్రస్తుతం ప్రభుత్వం అందివ్వాలని కోరుతూ యాత్ర చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమాలకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఒగ్గు ధర్మయ్య, ప్రధాన కార్యదర్శి ఒగ్గు రవి, అన్ని జిల్లాల నాయకులు, తదితరులు హాజరవుతారని చెప్పారు.

పంచలోహ విగ్రహాలు మాయం

ఇబ్రహీంపట్నం: పంచలోహ విగ్రహాలను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సత్యనారాయణ తెలిపిన ప్రకారం.. ఎలిమినేడు గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో సీతారామాంజనేయ పంచలోహ విగ్రహాలను దొంగిలించారు. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందన్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జాబ్ మేళాలో 400 మందికి ఉద్యోగులు

మైలార్‌దేవ్‌పల్లి: జాబ్‌మేళా ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందని మహావీర్ కళాశాల సెక్రటరీ సురేందర్‌రెడ్డి అన్నారు. మహావీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాలో 50 ప్రముఖ కంపెనీల వారు ఎంపికైన విద్యార్థులకు జాబ్ కల్పించారు. విద్యార్థులలో 40శాతం విద్యార్థులు వివిధ కంపెనీలలో ఎంపికవ్వంతో సురేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



నర్సింగ్ విద్యార్థుల ర్యాలీని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ స్వప్నాపరిమళ్ తదితరులు

మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నాపరిమళ్

తాండూరు టౌన్: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరకుండా ఉంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నాపరిమళ్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి పట్టణవాసులకు అవగాహన కల్పించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా చెత్త సేకరణదారులకు అందజేయాలన్నారు. ప్లాస్టిక్ వాడకం పూర్తిగా తగ్గించాలన్నారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతను కాపాడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ విజయాదేవి, మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డి, మేనేజర్ నరేందర్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

పంటల్లో నిల్వ నీటిని తొలగించాలి

వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి

తాండూరు రూరల్: అధిక వర్షాలకు పొలాల్లో నీరు నిలిచి పంట పాడయ్యే అవకాశం ఉంటుందని తాండూరు వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని బెల్కటూర్, గోపన్‌పల్లి, ఐనెల్లి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ.. అధిక వర్షాల వల్ల వివిధ పంటల్లో కొన్ని రకాల చీడపీడలు ఉధృతి అధికంగా ఉండే అవకాశం ఉందన్నారు. రైతులు ముందస్తు చర్యలు చేపట్టడంతో పంటలు కాపాడుకోవచ్చన్నారు. కంది, పత్తి పంటల్లో నీరు నిల్వ ఉండకుండా కాల్వల ద్వారా బయటకు నీళ్లు మళ్లించాలన్నారు. పత్తిలో ఎండు తెగ్గు లు ఎక్కువయ్యే అవకాశం ఉన్నందున మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను ఒక లీటరు నీటిని కలిపి మొక్కల మొదళ్లు తడిసేలా పిచికారి చేయాలని రైతులకు సూచించారు. వర్షాలు తగ్గిన తర్వాత పొలంలో వరుసల మధ్య భాగాన్ని గుంటకతో కాని గొర్రుతో కాని సేద్యం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ రుద్రమూర్తి, ఏఓ కొమరయ్య, ఏఈఓలు శ్రీను, శివ ఉన్నారు.



బెల్కటూర్‌లో పత్తి పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి

ఆర్టీసీ లాజిస్టిక్ సర్వీస్‌లను వినియోగించుకోవాలి

రంగారెడ్డి రీజియన్ ఏటీఎం రవీందర్

బంట్వారం: ఆర్టీసీ లాజిస్టిక్ విభాగం సర్వీస్‌లను వ్యాపారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి రీజియన్ ఏటీఎం రవీందర్ అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని తొర్మామిడిలో ఆర్టీసీ లాజిస్టిక్ కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే వికారాబాద్, తాండూరు, పరిగి డిపోల పరిధిలోని పలు ప్రాంతాల్లో లాజిస్టిక్ కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. వ్యాపారుల సౌకర్యార్థం గ్రామీణ ప్రాంతాల్లోనూ లాజిస్టిక్ కౌంటర్లను విస్తరింపజేస్తున్నామన్నారు. ఈ సర్వీసులను ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. సర్వీస్‌లతో వ్యాపారుల పార్సిల్స్ వేగంగా భద్రంగా తక్కువ ఖర్చుతో అందజేస్తామన్నారు. మరింత సమాచారం కోసం వికారాబాద్ జిల్లాలోని మార్కెటింగ్ లీడర్స్ కౌంటర్ ఏజెంట్స్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డిపో ఇన్‌చార్జి వసంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తొర్మామిడిలో లాజిస్టిక్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న రవీందర్

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి



తాండూరు టౌన్: భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: స్వాతంత్య్ర సమరయోధుడు భగత్‌సింగ్ బాటలో నేటి యువత నడవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బంటారం భద్రేశ్వర్, పట్టణ ఉపాధ్యక్షులు దోమ కృష్ణ, సంగమేశ్వర్, కార్యదర్శి బిచ్చప్ప, వడ్డే సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్ రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో భగత్‌సింగ్ జయంతిని శనివారం రెవల్యూషనరీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భీమరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ సభ్యులు బందెప్ప, భీమేష్, రవి, ఆంజనేయులు, మహేష్, రాజు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సేవకులకు హెల్త్‌క్యాంప్

అనంతగిరి: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశఋరు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది కార్మికులకు పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల మాట్లాడుతూ.. సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ఎన్విరాన్‌మెంట్ ఏఈ శ్రీనివాస్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ మంజుల, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్

నాగసముందర్ రైతుల సమస్య పరిష్కరించండి

యాలాల: శివసాగర్ ప్రాజెక్టులో నిలిచిన బ్యాక్ వాటర్ కారణంగా పొలాలకు వెళ్లేందుకు నాగసముందర్ రైతులు ఇబ్బంది పడుతున్నారని సీపీఎం, ఎంఎస్పీ నాయకులు అన్నారు. శనివారం వారు రైతుల పాట్లను గమనించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ నాయకులు శ్రీనివాస్, బుగ్గప్ప, ఎంఎస్పీ జిల్లా నాయకుడు మహేందర్ మాట్లాడుతూ.. బ్యాక్ వాటర్ కారణంగా సుమారు 500 మంది రైతులు పొలాలకు వెళ్లేందుకు రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. ప్లాస్టిక్ డ్రమ్ముల సాయంతో రోజు పొలం పనులకు వెళ్లి వస్తున్న తీరును గమనించారు. రైతే రాజు అని చెప్పుకునే ప్రభుత్వ పెద్దలు నాగసముందర్ రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు నర్సింహులు, నరేష్, రాములు, నరేందర్, మల్లప్ప, పాండురంగారెడ్డి, వెంకటయ్య, పెంటప్ప, మొగులయ్య ఉన్నారు.



శివసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌ను పరిశీలిస్తున్న నాయకులు

చెవులు కోసి.. ప్లాస్టిక్ కవర్లో మూటకట్టి

మహిళను హత్య చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

షాద్‌నగర్‌రూరల్: బంగారు ఆభరణాలకోసం చెవులు కోశారు.. ఆపై హత్యచేసి ప్లాస్టిక్ కవర్‌లో మూటకట్టి మృతదేహాన్ని రోడ్డు పక్కన పడేశారు.. ఈ దారుణ ఘటన పట్టణంలోని శ్రీనివాస కాలనీలో శనివారం వెలుగుచూసింది. సీఐ విజయ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. జిల్లేడ్ చౌదరిగూడ మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన కన్న భాగ్యలక్ష్మి అలియాస్ లక్ష్మ(40), వెకంటయ్య దంపతులు. వెంకటయ్య రెండో భార్యతో గ్రామంలో నివసిస్తుండగా.. మొదటి భార్య లక్ష్మి కూలీగా పనిచేస్తూ పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో అద్దె ఇంట్లో ఒంటరిగా జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు లక్ష్మిని హత్య చేసి చెవులు కోసి బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. అనంతరం మృతదేహాన్ని ప్లాస్టిక్ కవర్లో మూటగట్టి శ్రీనివాస కాలనీలో రోడ్డు పక్కన పడేశారు. గమనించిన కాలనీవాసులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న రంగస్వామి సీఐ విజయ్‌కుమార్‌తో కలిసి ఘటనా స్థలికి చేరుకున్నారు. కవర్ విప్పి చూడగా మహిళ మృతదేహం కనిపించింది. క్లూస్‌టీం ఆధారాలు సేకరించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతి చెందిన మహిళ ఆచూకీ తెలుసుకునేందుకు పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. మృతురాలు ముష్టిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మిగా పోలీసులు గుర్తించారు. శ్రీనివాస కాలనీవాసి మహ్మద్ సాదిక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.



లక్ష్మి మృతదేహం